# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. భారత్ – ఫిజి దేశాల మధ్య దౌత్య సంబంధాలను బలోపేతం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.**

**2. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు బాపట్ల జిల్లాలోని చీరాలలో నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొంటారు.**

**3. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో అన్నా కాంటీన్లను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**

**4. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి – ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఈరోజు నోటిఫికేషన్ విడుదలైంది.**

**5. ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25లో జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష కోసం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది.**

==========================

విదేశీ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫిజీలో పర్యటిస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు రాజధాని సువాలో ఫిజీ దేశాధ్యక్షులు రతు విలియమ్ మైవలిలీ కటోని వెరేతో, ప్రధాన మంత్రి సితివేణి రబుకాతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఫిజీ దేశపు అత్యున్నత పురస్కారం కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీతో రాష్ట్రపతికి ప్రధానం చేశారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫిజియన్ పార్లమెంట్‌లో ప్రసంగించారు. భారత్ – ఫిజి దేశాల మధ్య 75 సంవత్సరాల నుంచి దౌత్య సంబంధాలు కొనసాగుతున్నాయని ఇరు దేశాల మధ్య చారిత్రాత్మక సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. కాగా ఈ సాయంత్రం సువాలోని మహాత్మా గాంధీ హైస్కూల్లో ప్రవాసభారతీయలతో రాష్ట్రపతి సమావేశమై ప్రసంగిస్తారు.

------------------------

చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ కల్పించే విధానాలను ప్రోత్సహించాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళగిరిలో టాటా తనీరా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల తరహా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని నిన్న జరిగిన కలెక్టర్ల సదస్సులో సూచించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేపు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లాలోని చీరాలలో పర్యటించనున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రాంతాల్ని పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.

---------------------------

ఆగష్టు 15 నుంచి రాష్ట్రంలో అన్నా కాంటీన్లను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు విధివిధానాలపై అధ్యయనం చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ....

వాయిస్ ( 34సెకన్లు)

---------------------------

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి - ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ నోటిఫికేషన్‌ను ఈరోజు విశాఖపట్నంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈరోజు నుంచి 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 14న పరిశీలన, 16వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. 30వ తేదీన పోలింగ్, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుందని వెల్లడించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 838మంది ఓటర్లు ఉండగా, వీరిలో 479 మంది పురుషులు, 359 మహిళలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

---------------------------

ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25లో జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్-ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం షెడ్యూల్ విడుదల చేసినట్లు పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 8న పరీక్ష ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం 3.50 లక్షల రూపాయలలోపు ఉన్న, 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులుగా పేర్కొన్నారు. సెప్టెంబర్ 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.మరిన్ని వివరాలను ఞఞ.ఎంవ. ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా గానీ ఆయా జిల్లాల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో తెలుసుకోవచ్చని ప్రకటనలో తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు సంబంధించిన జల్ జీవన్ మిషన్ అమలుపై ఈ నెల 9 నుంచి 13 వరకు సర్వే నిర్వహించనున్నట్లు రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆర్ డబ్ల్యూఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా ఈ సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ సర్వే నిర్వహణకు ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేశామని తెలిపింది. 2023-24కేంద్ర వార్షిక నివేదిక ప్రకారం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 95.45 లక్షల గృహాలకు గానూ, ఈ ఏడాది మార్చి నాటికి 70.04 లక్షల ఇళ్లకు కుళాయిల ఏర్పాటు పూర్తయ్యిందని రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా,పారిశుధ్య శాఖ తెలిపింది.

---------------------------

బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పశ్చిమగోదావరి జిల్లా విస్సాకోడేరు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం - ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీకాంతం తెలిపారు. విస్సా కోడేరు సమగ్ర మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో జాతీయ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా

అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలింతలకు గర్భిణీలకు తల్లిపాల ప్రాధాన్యతను కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిపాల వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి లభిస్తుందని పేర్కొంటూ,

వాయిస్ (26 సెకన్లు)

---------------------------

కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. ఎగువన ఉన్న జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి శ్రీశైలంకు 3.93 లక్షల క్యూసెక్కుల నీరు చేరడంతో ఈ ఉదయం జలాశయం 10 గేట్లను 12 అడుగుల మేర ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం ప్రస్తుత నీటిమట్టం 883 అడుగులుగా ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 204.35 టీఎంసీలు గా నమోదైందని... కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

---------------------------

సికిల్ సెల్ ఎనిమియా వ్యాధిపై గిరిజన ప్రాంత ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చింతూరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు కె. కావూరి చైతన్య తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలోని రంగశీల, సూకురు గ్రామల్లో ఐటీడీఏ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికెల్సెల్ ఎనీమియ వ్యాధి కలిగిన వారు మంచి పౌష్టిక ఆహారం తీసుకుని ఐరన్ మాత్రలు వినియోగించాలని సూచించారు. 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలు వారు రక్త పరీక్షలు చేసుకోవాలని తెలిపారు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈనెల 13వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ రోజు హర్ఘర్ తిరంగా కార్యక్రమంపై ఛాయాచిత్ర ప్రదర్శన, రేపు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే చర్చావేదికలు, చిత్రలేఖనం, సంగీతపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 10వ తేదిన స్వాతంత్ర్య సమరయోధులు వి.వి గిరి జయంతి నిర్వహణ, 11న హెరిటేజ్ వాక్స్, 12న క్రీడాపోటీలు ఉంటాయన్నారు. 13న జాతీయ పతాకంతో సెల్ఫీల కార్యక్రమం చేపడతామన్నారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడేలా ప్రజలందరూ హర్ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

---------------------------

కడప-బెంగళూరు మధ్య 2008-09లో అనుమతించిన కొత్త రైల్వేలైను పనుల్ని వేగవంతం చేయాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి.మిధున్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పార్లమెంటులోని రైల్వేమంత్రి కార్యాలయంలో మంత్రితో సమావేశమైన మిథున్రెడ్డి పలు అపరిష్కృత అంశాలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. రాజం పేట నియోజకవర్గం పరిధిలోని పీలేరు, పుంగ నూరు, మదనపల్లి వంటి ప్రధాన పట్టణాల మీదుగా వెళ్లే లైను రాయలసీమ ప్రాంతం లో ఎంతోమందికి ఉపకరిస్తుందని చెప్పారు. కలికిరి రైల్వేస్టేషన్లో వసతులు మెరుగుపరిచి, పలు రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని రాజంపేట, నందలూరు స్టేషన్లలో కొన్ని రైళ్లను కోరామని వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని మిథున్ రెడ్డి తెలిపారు.

======================